క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ కనకరాజుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం గాజువాకకు చెందిన ఆకుల అప్పలసూరి అనే దాత రూ. లక్ష విరాళం ఇచ్చారు. సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు దాతకు బాండ్ అందజేయడంతో పాటు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం మాజీ మంత్రి, భీమిలి మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి గోదాదేవి సన్నిధిలో హారతి ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

5 నుంచి శ్రావణమాస పూజలు

దాబాగార్డెన్స్ : ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి దేవస్థానంలో వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శ్రావణలక్ష్మి ప్రత్యేక కుంకుమ పూజలు జరపనున్నారు. నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులకు దేవస్థానమే పూజా సామగ్రి సమకూర్చనుంది. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు (దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజ అనంతరం భక్తులకు కండువా, జాకెట్టు ముక్క, పావుకేజీ పులిహోర, పావుకేజీ చక్కెర పొంగలి, శ్రీచక్రయంత్రం (రాగి) మహాప్రసాదంగా అందజేస్తారు. శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం (ఆగస్టు 16) రోజున వరలక్ష్మీవ్రతం, 19న శ్రావణ పౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాలు (ఆగస్టు 9, 16, 23, 30) ప్రత్యేక పూజలు జరపనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 5 నుంచి సెప్టెంబర్ 3 వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే నాలుగు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాత:కాలంలో ప్రత్యేక క్షీరాభిషేకం, పూజలు, వివిధ అమ్మవార్ల స్తోత్రపారాయణం, కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. మొదటి శుక్రవారం (ఆగస్టు 9న) అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించనున్నారు.

రోడ్లు ధ్వంసం.. రాకపోకలు కష్టం



ఊటగెడ్డ సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గుంత



ధర్మారాయుడుపేట కూడలిలో ధ్వంసమైన రహదారి

పరవాడ: మండలంలోని పలు రోడ్లు ధ్వంసమయ్యాయి. భారీ వాహనాల రాకపోకలతో శిథిలమయ్యాయి. అడుగడుగునా గోతులు ఉండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.


ఇదీ పరిస్థితి

గాజువాక–యలమంచిలి రహదారి శిథిలమైంది. అనేక గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందూజా, ఎస్ఈజెడ్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ప్రతి నిత్యం రాకపోకలు సాగిస్తారు. చిన్నపాటి వర్షానికి రోడ్డు మీద గుంతలు వర్షం నీటితో నిండడంతో వాటిని గుర్తించలేక వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ఊటగెడ్డ–సినిమాహాలు కూడలి మధ్య పలు చోట్ల మోకాలి లోతు గుంతలు ఏర్పడడంతో భారీ వాహనాలతో పాటు ద్విచక్ర వాహనచోదకులు జారిపడుతున్నారు. రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలు పూడ్చకపోతే రాత్రి సమయంలో పెను ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో తరచూ వందల సంఖ్యలో భారీ, ద్విచక్ర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. పొంచి ఉన్న ప్రమాదాలను గుర్తించి ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భూ సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: సింహాచలం దేవస్థానం పరిధిలోని పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళతామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చెప్పారు. తొలుత 12,149 ఇళ్లు ఉన్న నివాస ప్రాంతంలోని భూ సమస్యను పరిష్కరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. సుజాతనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల మాట్లాడారు. ఎన్నికల సమయంలో భూ సమస్య పరిష్కారంపై ఇచ్చిన హామీ నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నామన్నారు. భూ సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున దానిపై అన్ని కోణాల్లో పరిశీలన చేసి ప్రజామోదయోగ్యంగా సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించి పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. ముందు నివాస ప్రాంతం సమస్య పరిష్కారం అయిన తర్వాత వ్యవసాయ భూమి, 144 ఎకరాల వీఎంఆర్‌డీఏ–దేవస్థానం మధ్య ఉన్న వివాదాస్పద భూముల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. దీంతో పాటు కాలుష్యం బారిన పడిన తాడి గ్రామం తరలింపుపై త్వరలో కీలక నిర్ణయం వెల్లడిస్తామని చెప్పారు. పరవాడ తీర ప్రాంతంలోని మత్స్యకారుల సమస్యపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో చర్చించామని..త్వరలో అధికారులు ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిష్కరిస్తారని భరోసా ఇచ్చారు. కొండవాలు ప్రాంతంలోని నిరుపేదల నివాసాలకు పట్టాలు మంజూరు చేసే విషయంపై కూడా తగిన మార్గదర్శకాలు రూపొందించాలని జీవీఎంసీ అధికారులకు ప్రభుత్వం సూచించిందన్నారు.

భూ ఆక్రమణలపై ఉక్కుపాదం

ఎమ్మెల్యే, ఎంపీ పేర్లు వాడుకుని ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకోవడం, వసూళ్లకు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. పేదల పేరుతో ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమిస్తే ఉపేక్షించబోమన్నారు. త్వరలో వారంలో ఒక రోజు ఫిర్యాదులు, సమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి వినతులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. తమ పార్టీ, మిత్ర పక్షాల వారు ఎవరు తప్పు చేసినా కచ్చితంగా చర్యలు ఉంటాయని చెప్పారు.

తీగలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..

పరవాడ: 'ట్రాన్స్‌కో.. మేలుకో' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. మండలంలోని దిబ్బలగొర్లివానిపాలెం రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగల కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఏపీ ట్రాన్స్‌కో అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలను విద్యుత్ శాఖ సిబ్బంది శనివారం తొలగించామని పరవాడ సెక్షన్ ఏఈ శేషసాయి తెలిపారు. సమస్యపై స్పందించిన ఏపీ ట్రాన్స్‌కో అధికారులను పలువురు అభినందించారు.



అల్లిక తీగలు తొలగించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

తొలిరోజే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలి



పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో రామ్మోహనరావు

సబ్బవరం: మండలంలోని సామాజిక పింఛన్ లబ్ధిదారులందరికీ ఆగస్టు 1వ తేదీనే పింఛన్ అందించడమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో రామ్మోహనరావు సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలో 8,219 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు. వారికి రూ.3,43,65,500 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మొదటి రోజు మిగిలిపోయిన లబ్ధిదారులు ఎక్కడ ఉన్న 2వ తేదీన విధిగా అందజేసి శతశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులంతా అందుబాటులో ఉండాలని ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఉపాధ్యాయులతో డీఈవో చంద్రకళ

డీఈవో చంద్రకళ

పెందుర్తి: ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సూచించారు. తరగతి గదిలో అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు 'టీచ్ టూల్' పేరిట జిల్లా స్థాయిలో ఎంపిక చేసిన 120 మంది హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో మాట్లాడుతూ కేటాయించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేసి ఉన్నతాధికారులకు సమర్పించాలని చెప్పారు. బాల్యాన్ని గౌరవించాలని..పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని ఆదేశించారు. సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎస్.పూర్ణచంద్ర, జిల్లా సహాయ ఎ.ఎం.వో జి.లక్ష్మి, హెచ్‌ఎం చిన్మయి, పెందుర్తి ఎంఈవో–2 మధుమూర్తి పాల్గొన్నారు.

వృద్ధుడు అదృశ్యం

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పొర్లుపాలెం సమీపంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం రజకవీధి సూర్యరత్నం కాలనీలో నివాసం ఉంటున్న గులివిందల అప్పారావు(60) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పెందుర్తి పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ ఎం.ప్రకాష్ తెలిపిన వివరాలు.. కాలనీలో నివాసం ఉంటున్న అప్పారావు ఈ నెల 16 ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. వారం రోజులు గడిచినా ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు శనివారం పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

పేదలకు ఉచితంగా న్యాయ సహాయం



ఎన్‌హెచ్‌ఆర్‌సీ ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈవో రామచంద్రనాయుడు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ప్రాంతీయ కార్యాలయాన్ని శనివారం సంస్థ సీఈవో టీఎస్ రామచంద్రనాయుడు, సర్పంచ్ దెద్దం ప్రసాదరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీఈవో రామచంద్రునాయుడు మాట్లాడుతూ ప్రజల హక్కులను కాపాడేందుకు.. అన్యాయం,అక్రమాలపై పోరాటానికి సంస్థ కృషి చేస్తుందన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని చెప్పారు.భూ వివాదాల పరిష్కారానికి,వినియోగదారుల హక్కుల పరిరక్షణకు.. కులరహిత సమాజ స్థాపనకు,సమాచార హక్కు చట్టం పక్కాగా అమలు చేసేందుకు,వృద్ధులు,బాలల,మహిళల హక్కుల కోసం పోరాటం సాగిస్తున్నామన్నారు. తమ సంస్థలో న్యాయవాదులు,రిటైర్డ్ జడ్జిలు అనేక మంది సభ్యులుగా ఉన్నారన్నారు.గ్రామీణ ప్రజలకు ఉచితంగా మెరుగైన న్యాయ సేవలు అందించాలన్న లక్ష్యంతో సబ్బవరం మండలంలో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి సూర్యప్రసాద్,వైస్ చైర్మన్ సూరిబాబు,డైరెక్టర్లు సుబ్బారావు, లక్ష్మీ గాయత్రి, జిల్లా కోర్టు న్యాయవాది సత్య,చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు

వ్యవసాయాధికారి చంద్రావతి



సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏవో చంద్రావతి

పరవాడ: సేంద్రియ వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి అన్నారు. రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావాడ గ్రామంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో సేంద్రియ వరి సాగు విధానంపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతికి, మామూలు పద్ధతికి తేడాలను వివరించారు. జీవన ఎరువుల ఉపయోగం, వాటిని వాడే విధానం క్షేత్ర పరిశోధన ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. రావాడలో 100 మంది రైతులకు పచ్చిరొట్ట విత్తనం, వరి విత్తనాలు, సూడోమోనస్, జీవన ఎరువులు అజోస్పైరిల్లం, వేపనూనె, వేపపిండి, వానపాముల ఎరువులను రాంకీ ఫౌండేషన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, కోన రామారావు, వియ్యపు చిన్న, పంచాయతీ కార్యదర్శి అనురాధ, వ్యవసాయ సహాయకులు గౌతమి, అనిత, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేశ్వరి, రైతు ప్రతినిధులు కాశీ, సూరిబాబు, మోటూరు అప్పలరాజు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐ శంకరరావు సేవలు అభినందనీయం



ఏఎస్‌ఐ శంకరరావును సత్కరిస్తున్న సీఐ పిన్నింటి రమణ తదితరులు

సబ్బవరం: సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహించి బదిలీపై విజయనగరం జిల్లాకు వెళ్తున్న ఎల్‌వీ శంకరరావు సేవలు అభినందనీయమని సీఐ పిన్నింటి రమణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం శంకరరావును సీఐతో పాటు మిగిలిన సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ రమణ మాట్లాడుతూ సబ్బవరంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంలో శంకరరావు కీలకంగా వ్యవహరించారన్నారు.ఆరోగ్యం సహకరించకపోయినా టోల్ గేట్ వద్ద పకడ్బందీగా విధులు నిర్వహించి అక్రమ మద్యం,నగదు,ఇతర వస్తువులు పట్టుకొని సీజ్ చేశారని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధనుంజయ్,వెంకటేశ్వరరావు, ఏఎస్‌ఐలు సత్యనారాయణ,పడాల్ తదితరులు పాల్గొన్నారు.

కూడలిలో అంధకారం



వెంకటాపురం కూడలిలో వెలగని హైమాస్ట్ లైట్

పరవాడ: వాడచీపురుపల్లి శివారు వెంకటాపురం కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ వెలగడం లేదు. ఫలితంగా చీకటి పడితే ఆ ప్రదేశం అంతా అంధకారం అలముకుంటుంది. వెంకటాపురం కూడలిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటు వెంకటాపురం, ఎస్సీ బాలుర వసతిగృహం, ప్రభుత్వ ఆస్పత్రి, అంగన్‌వాడీ కేంద్రం ప్రాంతాలకు వెలుగులు ప్రసాదించేది. అయితే ఈ లైట్ కొద్ది రోజులుగా వెలగడం లేదు. ఫలితంగా చీకటి పడితే వెంకటాపురం రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళ రహదారిలో విష పురుగులు, సర్పాలు సంచరించడంతో ప్రజలు భయాందోళనతో రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవడంతో పాటు వెంకటాపురం రహదారిలో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మ పేరుతో మొక్క

- విద్యార్థులకు సంరక్షణ బాధ్యత
- పాఠశాలల్లో సందడి



ఉక్కు కేవీలో తల్లితో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ వంశీ



లంకెలపాలెం స్కూల్ ఆవరణలో తల్లులతో కలిపి మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అగనంపూడి: అమ్మ పేరుతో మొక్కలు నాటిన విద్యార్థులు వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకున్నారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటారు. మిషన్ ఫర్ లైఫ్‌లో భాగంగా ఎకో క్లబ్‌ల ఏర్పాటు, కమిటీల నియామకం చేపట్టారు.

- లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులు తల్లులతో కలిసి 105 మొక్కలు నాటారు. కిచెన్ గార్డెన్ మొక్కలు నాటారు. నీడను, అందాన్నిచ్చే మొక్కలు నాటి, వారికి బాలల తల్లుల నామకరణం చేశారు. వాటి సంరక్షణ బాధ్యతలను బాలలే స్వీకరించారు. హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు మాట్లాడుతూ మిషన్ ఫర్ లైఫ్ ఉద్దేశం, పర్యావరణ పరిరక్షణలో ఎకో క్లబ్‌ల పాత్ర వివరించారు. కార్యక్రమంలో ఎకో క్లబ్ కో–ఆర్డినేటర్లు బి.వి.సన్యాసిరావు, ఎస్.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- పెదముషిడివాడ, ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ లేమర్తి, అగనంపూడి, పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో విద్యార్థులు తల్లులతో కలిపి మొక్కలు నాటారు.

స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పీలో కొత్త చూట్ ప్రారంభం



నూతన చూట్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీధర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన చూట్‌ను సీజీఎం మెయింటెనెన్స్ ఇన్‌చార్జి యు.శ్రీధర్ ప్రారంభించారు. పాత చూట్ స్థానంలో రూ.15 లక్షల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ విభాగం అధికారులతో మాట్లాడుతూ విభాగం ఉత్పత్తి, మెయింటెనెన్స్ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్త చూట్‌ను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎంలు పి.ఎస్.ఘోష్, ఎస్.వీరేశం, ఉన్నతాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సముద్ర చైతన్యంపై విద్యార్థులకు అవగాహన



కేవీ–1 విద్యార్థులతో నేవల్ అధికారులు, పాఠశాల అధ్యాపకులు

కంచరపాలెం: భారత నావికాదళంలో 'సముద్ర చైతన్యం–జీవితంతో పరిచయం' అనే అంశాలపై కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రీయ విద్యాలయం–1 విద్యార్థులకు మూడు రోజులుగా నిర్వహించిన అవగాహన సదస్సు శనివారంతో ముగిసింది. కేంద్రీయ విద్యాలయం–1కు చెందిన విద్యార్థులు మెటీరియల్ ఆర్గనైజేషన్‌ను సందర్శించారు. సుమారు 100 మంది విద్యార్థులకు అగ్నిమాపక ప్రదర్శన, డిపో పనితీరు గురించి నేవీ అధికారులు అవగాహన కల్పించారు. మానవ రహిత రోబోట్‌లతో కూడిన కసరత్తులు, స్టోర్‌ల నిర్వహణ కోసం ఆటోమేటిక్ స్టోరేజ్, రిట్రీవల్ సిస్టమ్‌ను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించినట్టు విద్యాలయ అధ్యాపకులు తెలియజేశారు.

సాంకేతికతతో మెరుగైన నైపుణ్యం

అల్లిపురం : విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవడం ద్వారా టెలికాం రంగంలో రాణించవచ్చునిబీఎస్‌ఎన్‌ఎల్ పీజీఎం (ఆపరేషన్స్) పి.పాల్ విలియం తెలిపారు. అమలాపురంలోని బొన్నా వెంకట చలమయ్య గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌తో విశాఖలోని బీఎస్ఎన్ఎల్ సంస్థ నైపుణ్యాభివృద్ధి శిక్షణకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. రాజమండ్రిలోని బీవీసీఈసీ ప్రాంగణంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి అందించేందుకు, వారిని వ్యవస్థాపకులుగా మార్చేందుకు తగిన శిక్షణ ఇచ్చేందుకు ఈ శిక్షణ ఉపకరిస్తుంది.

1262వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



మాట్లాడుతున్న అయోధ్యరామ్

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ పరిస్థితి దిగజారకమునుపే కేంద్ర ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు సిటూ నాయకుడు అయోధ్యరామ్ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షలు శనివారానికి 1262వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో ఉక్కు సిటూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాలుగా ఉక్కు పరిరక్షణ ఉద్యమం కొనసాగుతోందన్నారు. ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్న పరిణామాలు ఉక్కు ఉద్యోగులు, కార్మికులతో పాటు వారి కుటుంబాలను మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పరిస్థితులు మారకపోవడం దారుణమన్నారు. టీడీపీ, జనసేనలు ఈ విషయంలో స్పందించకపోతే రాష్ట్ర ప్రజలు క్షమించరన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు, సిటూ నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం సంజీవరావుకు సత్కారం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావును స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. సంజీవరావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సంజీవరావు కార్మిక పక్షపాతిగా అనేక ఒప్పందాల్లో కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో మార్పుపూడి పరదేశి, పిట్టారెడ్డి, ఎన్నేటి రమణ, ఎస్.ఈశ్వరరావు, నల్ల శ్రీనివాస్, జి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు నేతృత్వంలో నాయకులు జీఎం సంజీవరావును సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ జీఎం ఎన్.భాను, నాయకులు ఎం.కె.రెడ్డి, ఎం.గణపతి, పి.దానయ్య పాల్గొన్నారు.